# నవ్వు

## కొరుకొండ సత్యానంద్

గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

అర్ధరాత్రి. అరుణ ఆలోచనల్లో మునిగిపోయింది.

ఎంతకూ తేలని సమస్య!

అది తమ కుటుంబ సమస్య. అక్క జీవిత సమస్య!

ఆ సమస్యకు తనే పరిష్కార మార్గం. కారణం అక్క జీవితానికి పరోక్షంగా ప్రతిబంధకం అరుణ కాదు. ఆమె అందం.

దేవుని సృష్టిలో అందరూ సమానమే!

అతను ఎన్నో రకాలుగా ఈ మనుష్యుల్ని సృష్టించాడు.

కాని మనిషి అందానికి ఆకర్షితు డయ్యాడు, ఆ ఆకర్షణే ఒక సమస్యయి కూర్చుందిప్పుడు.

ఆమె అందం అక్క జీవితానికి అడ్డుగా నిలిచింది.

అది తన తప్పా? అని ప్రశ్నించు కుంటుం దెప్పుడూ!

కాదు అన్నజవాబు వచ్చినా అదెందుకో అసంతృప్తి కరంగా ఉంటుంది అరుణకు. మరి అక్క తప్పా?

ఎవరి తప్పూ కాదు. పెళ్ళి చూపులకు విచ్చేసిన మగమహారాజుల దృష్టి లోపం. అరుణ మనసు గజిబిజిగా తయారయ్యింది అన్ని విధాలా. ఎన్నోసార్లు ఆలోచించింది. మళ్ళీ మొదటికే వస్తుంది ఆమె ఆలోచన ప్రతి సారీ. ఈ తెగని ఆలోచనతో మరో తెంచుకోలేని అనుబంధం! అది తన జీవిత సమస్య. తన ప్రేమ హృదయానికి పరీక్ష.

అక్కను గూర్చిన ఆలోచనలతో అలిసిపోయిన అరుణ మనసు రాజు గురించి ఆలోచించడం మొదలు పెట్టింది.

రాజు తన ప్రేమికుడు. బాహ్య స్వరూపాలతో సంబంధం లేని ప్రేమ తమది.

తమ ప్రేమ వయసు మూడు సంవత్సరాలు,

మొదట్లో గాఢంగా ప్రేమించుకున్నారు ... తరవాత ఒకర్నొకరు అర్థం చేసుకున్నారు. ఒక నిర్ణయాని కొచ్చారు. ఇప్పుడు ఆ నిర్ణయానికి పూర్తి స్వరూపం ఎలా సంతరింప జేయాలో ఆలోచిస్తున్నారు.

ఆ స్వరూపానికి సమాధానం తల్లి దండ్రుల అనుమతి.

ఆ అనుమతికి అవకాశం అక్క వివాహం.

అలా ఆ రెండు సమస్యలూ గజిబిజిగా అల్లుకు పోయాయి అరుణ అంతరంగంలో.

రాజు చాలా మంచివాడు. అది తన అభిప్రాయమే కాదు. రాజు గురించి తను పరోక్షంగా వింది. అతను చాలా బుద్ధిమంతుడని, సంస్కారవంతుడని—అప్పుడే రాజుకు తన ప్రేమ వ్యక్తం చేసింది.

ఆ తరవాతకూడా అతన్ని పరిశీలించింది.

అతనితో సినిమాలు చూసింది. బీచ్‌కు వెళ్ళింది. పంటరితనంలో అందమైన అమ్మాయి తోడు మగవాడికి మహదానందం. దాన్ని సద్వినియోగ పరుచు కోవాలన్న ఉద్దేశంతో చాలా మంది స్కైకి తేలిపోతారు. ఆడదాన్ని రెచ్చ గొడతారు. కానీ. రాజు ఆ సమయాల్లో హుందాగా మాట్లాడేవాడు. అందంగా నవ్వేవాడు. బాగా ఆలోచింప చేసే విషయాలు ప్రస్తావించే వాడు. అన్నీ దూరంగానే!

అరుణ ఆలోచనలు రాజు నుండి మళ్ళీ అక్క వైపుకు మళ్ళాయి.

రాజు గురించి ఆలోచించడం నా స్వార్థం. అక్క సమస్య తీరందే రాజు గురించిన ఆలోచనలు సఫలం కావు.

అక్క సమస్య తీరాలంటే పెళ్ళి కొడుకులు మారాలి అని తనలో తనే అనుకుంది.

పెళ్ళి కొడుకులంటే అక్కను చూసేందు కొచ్చిన పెళ్ళి కొడుకులు కొందరు గుర్తు కొచ్చారు అరుణకు.

### ఒకటో పెళ్ళికొడుకు

యం. బి. బి. యస్. చదివాడు.

పొడవుగా ఉన్నాడు. నాజూగ్గా ఉన్నాడు. హుందాగా ఉన్నాడు. ప్రాక్టీసు పెట్టాడు. బాగా రాణించాడు. మంచి డాక్టరుగా పేరు తెచ్చుకున్నాడు. ప్రతిష్ట పెంచుకున్నాడు. పెళ్ళిచేసుకోవాలనిపించి పిల్లను చూడ్డానికొచ్చాడు.

ఎదురు కుర్చీలో కూర్చున్న అరుణ అక్క శాంతిని చూశాడు.

పేరు తెలుసుకున్నాక పేరుకు తగ్గ పిల్లను కున్నాడు. ఒక్క చూపులో ఆమెను 'పూర్తిగా' చూసేశాడు. తృప్తిగా నవ్వుకున్నాడు.


కానీ. మరు క్షణంలో కాఫీలతో వస్తున్న అరుణ కనిపించింది.


కళ్ళప్పగించి చూశాడు. అజంతా శిల్పం గుర్తు కొచ్చింది. రెప్ప వేయలేదు.

తన దగ్గర కొచ్చే పేషంట్లెవరూ ఈమె అంత అందంగా లేరు. అనుకున్నాడు. తండ్రిని బయటికి తీసుకెళ్ళి ఏదో చెప్పాడు.

విషయం విని శాంతి తండ్రి కాస్త గాభరా పడ్డా "అలా వీల్లేదండీ! పెద్ద పిల్ల పెళ్ళిచేయందే చిన్నదాని పెళ్ళి చేయమండీ!" అన్నారు.

పెద్దమ్మాయి పెళ్ళి అయ్యే వరకూ ఆగలేం. మా చిన్నమ్మాయిని చేసేసుకుంటాం! అని తమ అభిప్రాయాన్ని దర్జాగా చెప్పారు.





లోకం దృష్టికి వచ్చింది తండ్రికి.

పెద్దమ్మాయి పెళ్ళి కాకుండా చిన్నమ్మాయి పెళ్ళి జరిగిందంటే పెద్దమ్మాయిలో ఏదో లోపం ఉండి ఉంటుంది అంటుంది లోకం. అలా కాకపోతే చిన్నమ్మాయి తొందరపడి కాలు జారిందేమో అని అంటుంది.

అందుకే ఆ తండ్రి అందుకు ఒప్పుకోలేదు.

## రెండో పెళ్ళి కొడుకు

వ్యాపారంలో ఆరి తేరాడు. రంగు మాబెలా ఉన్నా ధన బొజ్జ దొడ్డగా ఉంది. చిన్న సైజు ఏనుగులా ఉన్నాడు.

పెళ్ళి కూతుర్ని చూశాడు. ఆబగా ఆవులించాడు. పొంగలుకూడా కార్చుకున్నాడు. కళ్ళు మిటకరిస్తూ తండ్రి వైపు 'బేరమాడు' అన్నట్టుగా చూశాడు.

తండ్రి బేరం పెట్టాడు. సాధారణంగా మనిషికి ఇరవై వేళ్ళుంటాయి కదండీ. ఇరవై వేల కట్నం ఇస్తే అది అందంగా ఉంటుంది. ఉభయులకూ శ్రేయస్కరంలో అని ఒక సొంత సూత్రం చెప్పాడు.

పెళ్ళి కూతురి తండ్రి ఆలోచనలో పడ్డాడు. మంచి సంబంధం కానీ కట్నం మాత్రం ఇరవై వేలు.

పెళ్ళి కొడుకు తండ్రి కాసేపు ఆలోచించి బేరానికి దిగాడు.

ఆ బేరం తగవుల్లో అప్పుడే కాలేజి నుండి వచ్చిన అరుణ పెళ్ళి కొడుకుదృష్టిలో పడింది. పెళ్ళి కొడుకు ఒంట్లో నరాలు జివ్వుమన్నాయి.

ఐదు వేలైతే ఇయ్యగలను—ఆఖరు మాటగా పెళ్ళి కూతురి తండ్రి అన్నారు.

పెళ్ళి కొడుకు సరే నన్నాడు కానీ, అరుణను పెళ్ళి చేసుకుంటా నన్నాడు.

ఆ మాటకు ఇంట్లో వాళ్ళంతా అరుణ వైపు గురగా చూశారు—శాంతి తప్ప! అరుణ బెదిరి పోయింది. ఆఖరుకు పెళ్ళి వాళ్ళు వెళ్ళి పోయారు.

## డో పెళ్ళి కొడుకు

బి. ఇ. చదివాడు. షిప్‌యార్డ్‌లో పని చేస్తున్నాడు. అందంగానే ఉన్నాడు. తల్లి దండ్రుల బలవంతం మీద పెళ్ళి చూపుల కొచ్చాడు.

పిల్లను చూశాడు సిగ్గు పడుతూ. బాగా ఉంది బాగా లేదు అని ఏమీ అనుకోలేదు.

తండ్రి అడిగాడు పిల్ల నచ్చిందా? అని.

తల్లి వంక చూశాడు. తన మాట దాటని కొడుకని అక్కడక్కడే పొగిడేసి పొంగి పోయింది తల్లి.

ఇంకా ఎంతమంది పిల్లలు? అని అడిగిం దామె.

చెప్పారు. చూస్తాను చూపించమంది.

తప్పలేదు. అరుణ వాళ్ళ ముందు కొచ్చింది. వాజూగ్గా ఉంది. నీట్‌గా డ్రెస్ చేసుకునుంది.

పెళ్ళి కొడుకు తల్లి కళ్ళు మెరిశాయి. మనసులో ఆలోచన.

ఆ ఆలోచన నోటి ద్వారా పైకొచ్చింది.

మరి మామూలే!

సంబంధం కాన్సిలయ్యింది. పెళ్ళికొడుకు తల్లి దండ్రుల వెనక చక్కగా వెళ్ళిపోయాడు.

## నాలుగో పెళ్ళి కొడుకు

అబ్బాయి యమ షోగ్గా ఉన్నాడు.

అధరాలు దాటిన అందమైన షోకు మీసాలు. గ్రేటెరె చెవులేమో. నీలి ఉంగరాల కురులతో కప్పేసుకున్నాడు. దళసరి నడుము. ధన బొజ్జ. తల్లి పోలికతో ఉన్నాడు. ముదురాకు పచ్చ గాబర్డిన్ పాంటు, పసుపు పచ్చ స్పన్ షర్టు. రక్త వర్ణం ఫోర్ ఇంచెస్ హైహీల్స్! కళ్ళను నింపిన వైట్ గాగుల్స్‌లోంచి చిన్న చిలిపి సినామా చూపు విసిరాడు.

తల్లి కొడుకు వైపు లాలనగా చూసింది. కొడుకు సిగ్గు పడ్డారు.

మాటల్లో దిగారు.

అబ్బాయి టెన్త్ క్లాస్ చదువుకున్నాడు. మా వూళ్ళో మా వాడే చదువుకున్నోడు. వేలకు వేలు ఇస్తామని వస్తున్నారు. మా వాడికి నచ్చలేదు. ఇప్పటికి యాభై మంది పిల్లల్ని చూశాం. ఊహూ మా వాడికి నచ్చందే! అవునూ, మీకు పని ఉందా? గది కిటికీ లోంచి లోపలకు చూస్తూ అంది.

ఏమనాలో అర్థం కాలేదు. మా అమ్మాయే నండీ అన్నారు.

"పేరు?"

"అరుణ"

"సొంతమ్మాయేనా? లేకపోతే మారుటి కూతురా?" అని అడిగింది.

"మా అమ్మాయే!"

"పని పిల్ల లాగుందేటి? మీరు క్లాసుగా ఉండరా? మా లాంటి వాళ్ళు వచ్చినప్పుడైనా క్లాసుగా ఉంటారు. మేం క్లాసైన వాళ్ళం. మా అబ్బాయికి వాడిలా క్లాసుగా ఉంటే కానీ ఇష్టపడడు. వద్దా అబ్బాయీ! బొత్తిగా క్లాసులేని సంబంధం!"

## ఐదో పెళ్ళి కొ కు

మాస్టరాఫ్ సైన్స్ చదివాట్ట. లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు పెట్టాట్ట. నూతన భావాలు గలవాడు. అందుకే చిన్న లెక్చర్ దంచాడు.

కట్నం అక్కర్లేదన్నాడు. ధరలు ఆకాశాన్నంటుతున్న ఈ సమయంలో ఒక ఫామిలీని లీడ్ చేయడం అబ్బో! హారిబుల్! సో. పెళ్ళి చేసుకుంటే భార్య ఉద్యోగం చేయాలి. చేయక పోయినా చదూకుంటే చాలు. ఉద్యోగం నేను చేయిస్తాను ఈ కాలంలో భార్యా భర్తలు పని చేస్తేనే కానీ మా జానెడు పొట్టలూ నిండవు. మీ అమ్మాయి చదువుకో లేదు కదా! మీ రెండో అమ్మాయి డిగ్రీ పాసైంది కదూ! డిగ్రీ కాలేజీలో చూసేవాడ్ని. వెరీగుడ్ అండ్ ఇంటలిజెంట్ గర్ల్. అసలా అమ్మాయి కోసమే వచ్చాం కానీ మీరు ఈ అమ్మాయిని చూపించారు అన్నాడు.

అరుణకు ఉగ్రకోపం ఆగలేదు. తల్లి దండ్రుల ఎదుట ఏమీ అనలేక పోయింది. కుదరని సంబంధాల సంద్రంలో మరో నీటి చుక్క పడింది.

• • •

ఇలా ఎన్నో సంబంధాలు వచ్చాయి. వాటిల్లో చాలా తప్పిపోవడానికి ఒకవిధంగా నేనే కారణం మిగిలినవి కట్నాలు బాగా ఎక్కువ కావడంవల్ల అక్క ఆ పెళ్ళికొడుకులకు నచ్చక పోవడంవల్ల కొన్ని సంబంధాలు నాన్నగార్కి నచ్చకపోవడంవల్ల తప్పిపోయాయి.

నాన్నగారు సంబంధాలు వెదకడంలో చాలా విసి పోయారు.

వచ్చిన ప్రతి సంబంధవూ ఎలాగో పో తప్పిపోవడంవల నాన్నగారు, అమ్మ ఆదో అయిపోయారు.

వాళ్ళదగ్గర నేను ఏదో తప్పు చేసిందా తప్పించుకు తిరగాల్సొస్తుంది.

అక్క సంగతి చెప్పక్కర్లేదు. తనవ అందరూ బాధపడుతున్నారని అనుకుంటుం వెలితిగా, బెంగగా కన్పిస్తుంది.

మొదట అక్కను చూడ్డానికొచ్చిన డాక్ట పెళ్ళికొడుకు తల్లిదండ్రులు ఉత్తరం వ్రాశా ఆ పెళ్ళికొడుకు నన్ను తప్ప వేరొకర్ని పె చేసుకోనని భీష్మించుకు కూర్చున్నాట్ట.

ఉత్తరం చదివి నాకు నవ్వొచ్చింది.

నవ్వబోయాను. కానీ ఎదురుగా అక్క.

అక్కను చూడ్డాని కొచ్చిన పెళ్ళికొడుక్కి నేను నచ్చానంటే, నన్ను తప్ప వేరొకర్ని చేసుకోనంటే, ఆ సంగతికి నాకు నవ్వొచ్చి నేను నవ్వానంటే?

అక్క ఏమనుకుంటుంది?

ఆమె పరిస్థితి ఏమవుతుంది? ఆమె హృదయం ఎంత బాధపడుతుంది?

ఊహించుకుంటే నా గుండె పీకుతుంది. అందుకే నవ్వలేదు.

ఇలా రోజులు గడిచిపోతున్నాయి. ఈమధ్య అక్కకు సంబంధాలు కూడా రావడంలేదు.

రాజాకి బాంక్‌లో క్లర్క్—కమ్—కాషియర్ ఉద్యోగం వచ్చి రెంతెళ్ళయింది.

పెళ్ళికి తొందరపడుతున్నాడు. కలిసి నప్పుడల్లా అడుగుతున్నాడు.

సమాధానం ఏం చెప్పాలి?

మామూలుగానే అన్నాను.

మా అక్కకు సంబంధం కుదరడం లేదు. ఇప్పుడు ఇంట్లో మన విషయం చెప్తే, అసలే చికాకుగా ఉన్న పరిస్థితుల్లో మన ప్రేమ వయసు చైత్యంలా కన్పిస్తుంది. పరిస్థితుల నర్థం చేసుకోలేని దాన్ననుకుంటారు. చెడిపోతున్నానని అనుకుంటారు. ఏం అంటారో వాళ్ళకే తెలీదు. నామీద అభిమానంతో కొన్నాళ్ళాగు రాజా! అన్నాను.

రాజా మాత్రం ఏం అంటాడు?

మౌనంగా ఉండిపోయాడు.

ఒకప్రక్క మనసారా ప్రేమించిన మనిషి, మరోప్రక్క కుటుంబ పరిస్థితులు.

అర్థంగాక అయోమయంగా ఉంది నా పరిస్థితి.

* * *

గడియారం మూడు గంటలు కొట్టింది.

ఒక కొలిక్కిరాని తన ఆలోచనా పరంపరల నుండి అరుణ కాస్త తేరుకుంది.

ప్రక్కకు తిరిగి చూసింది.

మంచం మీద అక్క. పూర్తిగా నిద్రపోయినట్లు లేదు.

ఆమె ముఖంలో భావాలు అర్థంగావడం లేదు అరుణకు.

తనే ఇంతలా ఆలోచిస్తుంటే, అక్క ఇంకెంత ఆలోచిస్తుందో?

ఆ ఆలోచనల్లో తను ఉంటుందా? అక్క తనను ఏమనుకుంటుందో? అని ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది.

* * *


"పోస్ట్!"

ఉత్తరాన్ని శాంతి అందుకుని చదివింది.

అప్పుడే అక్కడకు వచ్చిన అరుణ—"ఎవరక్కా ఉత్తరం వ్రాసింది?" అని అడిగింది.

శాంతి నవ్వుతూ ఉత్తరాన్ని అరుణ కందించింది.

"బావగార్కి నమస్కారములు. ఉభయ కుశలోపరి.




మా అబ్బాయి మీ అరుణను తప్ప ఎవ్వరినీ పెళ్ళి చేసుకోనని అంటున్నారు. వాడ్ని చూస్తుంటే నాకేమనాలో, ఏం చేయాలో తోచడం లేదు. వాడి పరిస్థితి బాగాలేదు. ప్రాక్టీసు కూడా సరిగా చేయడం లేదు. మీరు పైసా కట్నం ఈయ నవసరంలేదు. పెళ్ళి ఖర్చంతా మేమే భరిస్తాం. ఈ విషయాన్ని అమ్మాయికి చెప్పి ఒప్పించండి. సమాధానంకోసం ఎదురు చూస్తుంటాం!

విశ్వేశ్వర్రావ్."

అరుణ ముఖం వాడిపోయింది.

ఉత్తరాన్ని పట్టుకొని అలాగే ఉండిపోయింది. అక్కవైపు ఎలా చూడాలో అర్థం కాలేదు.

"ఏం అరుణా! ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుతావ్?" అంది నవ్వుతూ శాంతి.

అరుణ తల ఎత్తి చూసింది అక్కవైపు.

వాడని పువ్వులా నవ్వుతుం దామె. అరుణ తట్టుకోలేకపోయింది.

"అక్కా!" అని శాంతిని గట్టిగా కౌగిలించుకుంది.

ఎంత ఆపుకున్నా కన్నీరు ఆగలేదు.

"చ! ఎందుకు అరుణా ఏడుస్తున్నావ్? అతనికి ఎంతో నచ్చిన దానివి, ఎంతగానో అడుగుతున్నారు. పెళ్ళి చేసుకో! కోరి పెళ్ళి చేసుకున్న భర్త సరసన నీ జీవితం ఆనందమయం అవుతుంది".

"అక్కా! నీ దెంత మంచి మనసు. నా వల్ల నీకు ద్రోహం జరుగుతున్నా నువ్వు ప్రశాంతంగా ఎలా నవ్వుతున్నా వక్కా?"

"ద్రోహమా? ఏమిటమ్మా నీ పిచ్చి మాటలు? చెల్లెలి జీవితం నందనవనం అవుతుంటే ఏ అక్క సంతోషించదు? చ. వూరుకో!" భుజం తట్టి ఓదార్చింది శాంతి.

* * * *

అరుణ వంట చేస్తుంది.

పక్క గదిలో తల్లి దండ్రులు మాట్లాడుకుంటున్నారు. నెమ్మదిగా వినిపిస్తున్నాయి.

"ఆ అబ్బాయి అంతగా కోరుకుంటున్నాడు. కట్నం అక్కర్లేదంటున్నాడు. అరుణకు ఆ సంబంధమే ఖాయం చేసెయ్యండి." అంది తల్లి.

"చెయ్యాలని నాకూ ఉంది. పానీ పెద్దదానికి కాకుండా చిన్నదానికి ఎలా చెయ్యాలి? దానికి సంబంధం కుదిరేసరికి వీళ్ళు మరో పిల్లను చూసుకుంటారు. దానికి సంబంధం కుదరదు. దానికి కుదరందే దీనికి చేసేందుకు వీల్లేదు. చీ ఆడపిల్లల్ని కనకూడదు. కన్నా." ఏదో అనబోయి బయటకు వెళ్ళిపోయాడు.

అరుణ శాంతి గదిలోకి వెళ్ళింది.

అరుణను చూసి శాంతి పైటచెంగుతో అటువైపు తిరిగి కళ్ళొత్తుకుంది.

"అక్కా! ఏడుస్తున్నావా?"

"చ! లేదు, కంట్లో నలకపడింది."

"ఔనక్కా! నీ జీవితంలో నలక పడింది. ఆ నలకను నేనే కదూ!"

"అరుణా! అవేం మాటలమ్మా! ఎవరి అదృష్టం వాళ్ళది. ఎవరూ ఎవరికీ అడ్డు కాదమ్మా!"

"ఏమైనా అక్కా! నీ పెళ్ళి కాందే నేను పెళ్ళి చేసుకోను. నీ కో మంచి సంబంధం చూసే బాధ్యత నాది."

చిన్నగా నవ్వింది శాంతి.

"అరుణా! నాతో నువ్వు పెట్టుకోకు. నా జీవితానికి వసంతం చాలా దూరంగా ఉందమ్మా!"

"అక్కా! నువ్వలాగే అంటూ ఉండు. నీ కో మంచి పెళ్ళికొడుకుని తీసుకురాకపోతే చూడు..." అని అక్కను కౌగలించుకొని నవ్వింది.

ఆ సప్తస్వరాల నవ్వులో ఒక స్వరం అపస్వరంగా పలికింది.

* * * *


భానుడు పడమటి కాంతల ఒడిలోకి [illegible] తున్నాడు.

కడలి కెరటాలు తీరంతో పోరు సాగిస్తున్నాయి.

సముద్రఘోషను ఎవరూ పట్టించుకోవడంలేదు.

ఎవరి గొడవల్లో వారున్నారు.

ఆ రోజు ఆది వారం ... ఆ రోజు ఆ సమయంలో ఆ ప్రదేశం ఎప్పుడూ జంటల సంగమ భరితం. [illegible] కలిసినా, కలవక పోయినా రాజా, అరుణ [illegible]



తెలుసుకునే రోజిది.

నంబర్ టెన్ బస్ దిగి అరుణ గబగబా అడుగులు వేసుకుంటూ క్వాలిటీ ప్రక్కనున్న మెట్లు దిగి సముద్రపు తీరాన్ని చేరుకుంది—వాళ్ళెప్పుడూ కూర్చునే ప్రదేశంలో రాజు ఉన్నాడో, లేడో చూస్తూ ...

దూరంగా రాజు కన్పిస్తున్నాడు.

తెల్లని బట్టలు ... చల్లని మనసు ... సముద్రం కేసి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు.

కొద్దిసేపట్లో అతని ఆలోచనలు ఆగిపోతాయి. తన సమస్య సగం తీరిపోతుంది.

అరుణ రాజు ప్రక్కన కూర్చుంది. రాజు ఏదో మాట్లాడుతున్నాడు. అవకాశంకోసం చూస్తుంది అరుణ.

అరగంట గడిచింది.

"అరుణా! మన పెళ్ళి గురించి ఏదైనా నిర్ణయాని కొచ్చావా?" ఇసుక తిన్నెల వైపు చూస్తూ అడిగాడు.

"వచ్చాను." రాజు వైపు చూస్తూ నెమ్మదిగా అంది అరుణ..

"ఏమిటి అరుణా! మీ అక్కగారికి సంబంధం కుదిరిపోయిందా? లేకపోతే ఇంట్లో మన పెళ్ళి గురించి చెప్తే ఒప్పుకున్నారా?" ఆత్రతగా అడిగాడు రాజు.

అరుణ నవ్వింది చిన్నగా!

ఆ నవ్వులో దాగి ఉన్న విషాదం ఉంది ... ఎంత తొందరో? అన్న కొంటెప్రశ్న ఉంది.

రాజు సమాధానంకోసం ఎదురు చూస్తున్నాడు.

"దానికి జవాబు చెప్పే ముందు నిన్ను కొన్ని ప్రశ్న లడగాలి."

"ఇంటర్వ్యూనా?"

"కాదు ... నీ మనసు ... నీ మనసు నాకు తెలియంది కాదు. ఇన్నాళ్ళూ దాన్ని కళ్ళతో చూశాను. ఇప్పుడు చెవులతో వినాలనుంది."

"అయితే అడుగు!"

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా?"

"బాగుందీ ప్రశ్న! వెనకటి కెవడో రామాయణం అంతా విని రాముడికి సీ తేమవుతుం దన్నాట్ట... నిన్ను ప్రేమించకపోతే ఈ సాయంత్రాల వేళ బీచ్‌లూ, నీకోసం వెయిటింగ్‌లూ, నీ గ్రీన్ సిగ్నల్ కోసం పడిగాపులూ ఎందుకు?"

అరుణ నవ్వింది. మరుక్షణం గంభీరంగా అంది: "స్త్రీ పురుషుడ్ని ప్రేమించేది అతని మనసును చూసే! కానీ స్త్రీని పురుషుడు ఆమె అందాన్ని, ఆస్తిని చూసి ప్రేమిస్తాడు."

"నువ్వు పొరపడుతున్నావ్ అరుణా! స్త్రీ పురుషులు ఇద్దర్లో మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు ఉన్నారు... మనసును చూసి ప్రేమించిన మగవాళ్ళు చరిత్రలో చాలామంది ఉన్నారు."

"అది సరే రాజూ! నీ విషయం చెప్పు ..."

"అది వేరే చెప్పాలా అరుణా? నేను ప్రేమించేది నీ కున్న మంచి హృదయాన్నే, నీ సుగుణాల్నే!" ఆ మాటకు అరుణ మనసు ఉప్పొంగి పోయింది.

"థాంక్స్ రాజా!"

"ఏమిటి అరుణా! ఈ రోజిలా మాట్లాడుతున్నావ్?"

ఆ మాటకు అరుణ గుండెలో రక్తం కరిగి పోయింది. అవి కళ్ళల్లో కన్నీళ్ళుగా ప్రతిఫలించకుండా జాగ్రత్త తీసుకుంది."

హృదయభారాన్ని భరిస్తూ హాయిగా నవ్వింది.

హాండ్‌బాగ్ లోంచి ఒక కవర్ని తీసి "రాజా! ఈ కవర్లో ఒక జీవిత సమస్య ఉంది. సంస్కారం నిండిన మనసుతో చదువు. సమాధానం కోసం ఎదురు చూస్తుంటాను. వెళతాను" అని అక్కడ నుండి లేచి వెళ్ళిపోయింది.

చేతిలో విషయం తెలియని ఉత్తరం. వెన్నెల్లో దూరంగా వెళ్ళి పోతున్న వింత అరుణ.

రాజుకు ఏమీ అర్థం కాలేదు.

పక్కన ఘోష పెడుతున్న సముద్రం. దూరంగా ఆశ్చర్యంలో నిండి పోయిన ప్రేమించిన హృదయం.

అరుణ గుండె భారంగా ఉంది.

రాజు క్వాలిటీ లోకి అడుగు పెట్టాడు. కాఫీ ఆర్డ రిచ్చి గబగబా కవరు విప్పి చదివాడు.

"రాజా!"

ఈ రోజు నా ప్రవర్తన కొత్తగా, నా మాటలు వింతగా ఉన్నాయి కదూ! నాకు మాత్రం నీ సమాధానాలు వింతగా కాని, కొత్తగా గాని లేవు. ఎందుకో తెలుసా? నీ మనసు నాకు తెలుసు కనక. నీలో సంస్కారం నిండి ఉంది కనుకనప్పుడునేనో నిర్ణయాన్ని నీ ముందుంచ పోతున్నాను. దాని తుది నిర్ణయాన్ని కూడా నీ సంస్కార యుత హృదయమే జాగ్రత్తగా ఆలోచించి తీసుకుంటుందని ఆశిస్తున్నాను.

నువు నన్ను ప్రేమించింది నా అందాన్ని చూసి కాదు కదూ! నా మంచి హృదయాన్ని చూసి. అవునా? అంటే నీ క్కావలసింది మంచి హృదయం. మంచి హృదయాన్ని నువ్వు ప్రేమతో స్వీకరిస్తావ్. నీ సంస్కారానికి నా జోహార్లు.

మా అక్క సంగతి నీకు తెలుసు కదా! నా కంటే చాలా చాలా మంచిది. ఉదాహరణకు ఒక విషయం చెప్పమంటావా? తనను చూడ్డాని కొచ్చిన డాక్టరు పెళ్ళి కొడుకు నన్ను చూసి నా మీద మోహాన్ని పెంచుకుని నా కోసమే తపిస్తున్నాడని వాళ్ళ తండ్రి వ్రాసిన ఉత్తరం చదివికూడా నన్ను 'చెల్లీ' అని నిండు హృదయంతో పిలిచిందీ అంటే అంతకన్నా మంచి మూర్తీభవించిన హృదయం నాకు లేదంటాను. కాని ఆమె మంచి హృదయాన్ని చూతో వాళ్ళెందరు?

రాజా! నన్ను క్షమిస్తానంటే, నా మాట వింటానంటే ఒక విషయం చెబుతాను. నువ్వు మా అక్కను పెళ్ళి చేసుకో! ఆమె నిండు హృదయానికి నీ సంస్కారం సరైన జోడీ. ఇలా వ్రాశానని ఏమైనా అనుకుంటున్నావా? ఆమె నిరాశా నిస్పృహలతో నిండి మోడులా తయారవుతుంది. ఆమెకు నీ జీవితంలో భాగాన్నిచ్చి, నీ చేయూత నిచ్చి ఆమెను మామూలు మనిషిని చెయ్యి. ఇది నా అభ్యర్థన.

నీ నిర్ణయం కోసం ఎదురు చూస్తుంటాను రేపు నువ్వు నీ తల్లి దండ్రులతో మా అక్కను చూడ్డానికి వస్తావు కదూ!

ఇట్లు
అరుణ."

ఉత్తరం చదివి బుర్రతో పేలినట్లయింది రాజుకు.

కాని తరవాత ఉత్తరంలో ఒకొక్క విషయాన్నీ జాగ్రత్తగా ఆలోచిస్తూ ఇంటికి చేరుకున్నాడు.

*　*　*　*

సాయంత్రం నాలుగ్గంట లయ్యింది.

అరుణ వరండాలో పచార్లు చేస్తుంది. రాజు వాళ్ళ కోసం ఎదురు చూస్తుంది. ఇంట్లో ఎవ్వరికీ తెలియ దీ విషయం. పూర్తిగా విషయం ఏ కొలిక్కి రాకముందే ఎవ్వరికీ చెప్ప కూడదనుకుంది.

మరో అరగంట గడిచింది. ఇంకా ఎవ్వరూ రాలేదు. ఎదురు చూస్తూ ఆలోచిస్తుంది అరుణ.

అంతలో 'పోస్ట్' అన్న కేక విని బయటికి వెళ్ళింది.

పోస్ట్‌మాన్ ఏదో కవరు ఇచ్చాడు. ఫ్రమ్ అడ్రస్ లేదు.

గబగబా విప్పి చదివింది.

"డియర్ అరుణా!

నా కోసం ఎదురు చూస్తున్నావు కదూ! నీ

అభ్యర్థన చదివాను. విషయం అంతా బోధ పడింది. మంచి నిండిన మీ అక్కగార్ని చూసేందుకు వేరే రావాలా? నా సంస్కారం ఆపని చేయదు. ఎందుకో తెలుసా? నా కున్న సంస్కారం ప్రాణం లేంది కాదు. చేతకానిది అంతకంటె కాదు. దానికి మూర్ఖత్వం అంటే ఏమిటో తెలీదు.

కానీ నీవు వ్రాసిన ఉత్తరాన్ని బట్టి తెలుస్తూంది. నీక్కూడా సంస్కారం ఉందనీ, దానికి ప్రాణం లేదని, అది చేతకానిదని.

నీది మూర్ఖత్వం నిండుకున్న నిర్మలమైన సంస్కారయుత హృదయం!

అది డాక్టరు మొగుడ్ని కట్ట బెట్టుకోవాలన్న నిస్వార్థమైన ప్రగాఢ వాంఛాయుతం!

నేనుకూడా పెంచి పెద్ద చేసిన ఇంటకి వాళ్ళను ఎదిరించి, వేల కట్నాల్ని వదులుకునే మూర్ఖుణ్ణి కాదు నా హృదయం ప్రాణం లేని పూలకుండీ కాదు. ఏ మొక్కనైనా దాచుకోవడానికి. అందుకే మీ ఇంటికి రావడం లేదు.

ఆఖరుగా ఒక్క మాట అరుణా!

పిరికివాళ్ళకు ప్రేమ, ప్రేమకు స్వార్థం అవాంఛనీయాలు!

రాజా."

ఉత్తరం చదివి అదిరి పడింది అరుణ. గుండె జారుపోయింది.

తను ఇలా చేసింది ఎందుకు? కానీ జరిగిందేమిటి? అంతలో తన వెనక ఎవరో ఉన్నట్లనిపించి వెనక్కి తిరిగి చూసింది.

అక్క! ఉత్తరం చదువుతుంది. కంగారుగా ఉత్తరం మడిచేసింది. బిందె చేత్తో పట్టుకుని చెలెలి వైపు చూసి చిన్న నవ్వు నవ్వి అక్కడినుండి వెళ్ళిపోయింది శాంత.

ఆ నవ్వుకు అర్థం?

ఆలోచిస్తూ కూర్చుండి పోయింది అరుణ★

---

## సాహితీ ప్రపంచం

# సాహితీ ప్రభంజనం చలం

### డా. నా. శాస్త్రి

తెలుగు సాహిత్యంలో వివాదాస్పద వ్యక్తిగా మిగిలి, ఎందరో అభిమానులతోపాటు శత్రువుల్ని కూడా పెంచుకొని, తెలుగు పాఠకుల్ని మూడు దశాబ్దాలకిపైగా ఉగ్రరాత లాగించిన మహా రచయిత, దార్శనికుడు, స్వాప్నికుడు శ్రీ గుడిపాటి వెంకటచలం. తెలుగు సాహిత్యంలో 1894 మే 18 మరపురాని రోజు. ఎందుకంటే చలం పుట్టింది ఆరోజునే కాబట్టి. అలాగే సాహితీ ప్రియులు శోకార్తులయిన రోజు 1979, మే 5— ఈరోజుని కూడా మర్చిపోలేం. ఎందుకంటే నవలా లోకాన్ని నిస్తేజం చేసి ఎంతోమంది అభిమానుల్ని శోకసముద్రంలో ముంచేసి పూర్ణత్వ దగ్గరికి చలం వెళ్ళింది ఆ రోజునే.

గళ్ళలుంగీ, నెత్తికి రుమాలు, చేతిలో ఏక్‌తార, వెంట ఒక పసిపిల్ల, కూనిరాగాలు—ఇదీ చలం అంటే. అలా వీధుల్లోనూ, పూల తోటల్లోనూ విహరించడం చలానికి మామూ. చలం పట్టుదల మనిషి కాదు. అబద్ధాలు చెప్పడం, డబ్బులు అప్పు అడగటం చలానికి గిట్టవు. చలం సర్వ స్వతంత్రుడు. తాను నమ్మిన దానిని రచనలో చూపించాడు. ఇతరుల ప్రశంసలకోసం, సన్మానాల కోసం, బహుమానాలకోసం ఎప్పుడూ ప్రాకులాడ లేదు. చలం రాసిన "మైదానం" నవల ఆంధ్ర విశ్వ విద్యాలయం నిర్వహించిన నవలల పోటీనుంచి తిరిగొచ్చినా, తెలుగు పాఠకుల హృదయాలలో మాత్రం తిష్ఠ వేసుక్కూర్చుంది. స్త్రీ జనోద్ధరణని వస్తువుగా స్వీకరించి నవలలు రాశాడు. 'చలం స్త్రీసెక్స్ కావాలంటాడు' అనే విమర్శని పొందాడు. సాంఘిక అన్యాయాలమీద చలం కలం వజ్రాయుధంలా ప్రయోగించబడింది. ఎంతో సంచలనాన్ని సృష్టించాడు. కొందరి దృష్టిలో చలం 'అభినవవేమన' మరి కొందరి దృష్టిలో చలం 'పిరికివాడు'

చలంలో వైరుధ్యముందని అందరూ అంగీకరిస్తారు. చలం మరణించగానే కొందరు 'ఇది రెండవ మరణం' అన్నారు. మొదటి మరణం రమణాశ్రమానికి వెళ్ళటమని వారి అభిప్రాయం. సమాజ క్షాళనకు తలపెట్టిన చలాన్ని మొదటి సారిగా రమణమహర్షి ఆశ్రమానికి తీసుకెళ్ళింది చింతా దీక్షితులు. అయితే రమణాశ్రమంలో శాశ్వతంగా ఉండిపోవటానికి చలం వెళ్ళింది 1951 లోనే. అక్కడే ఆధ్యాత్మిక సాధన ప్రారంభించడం జరిగింది.

చలం సమాజంకోసం దాపారని కొందరను కుంటూ చలం రమణాశ్రమానికి వెళ్ళటాన్ని దుయ్యబడుతున్నారు. కాని చలం ఏమన్నాడు— "నా పుస్తకాలలో తిట్టింది బయట ఉన్న మనుష్యులను కాదు. నన్నే. నాలో ఏయే మచ్చ లున్నాయో వాటిని నేను గట్టిగా తిట్టుకోవడంతో... నేను వ్రాసిన పుస్తకాలన్నీ బయలుదేరాయి. అది మిమ్మల్ని అనుకొని మీరు చాలా కోప్పడ్డారు' అని. తనను క్షాళనం చేసుకోవటానికి ప్రయత్నించడం లోనే రచనలు వెలువడ్డాయి. తన జీవితంలోని సంఘర్షణనే చిత్రీకరించటం జరిగింది. ఇదే విషయాన్ని చాలామంది మిత్రులకి లేఖలద్వారా తెలియపర్చారట!

ప్రాచ్య పాశ్చాత్య దేశాల ఆలోచనా ధోరణి ఆయనలో పొదుకుపోయింది. తెలుగులో చలం కలం భాషలో, భావంలో ఒక ప్రత్యేకతని సంతరించుకుంది. కృతక భాషని త్రిప్పికొట్టి వ్యావహారికానికి చేయూతనిచ్చింది. చలం దయార్ద్ర హృదయుడు. మితభాషి. అవసరమైనప్పుడు, మనసు ఉల్లాసంగా ఉన్నప్పుడు సంభాషణా ప్రియుడు. కాకినాడలో రఘుపతి వెంకటరత్నంగారి ద్వారా మానవోద్యమంలో పాల్గొన్నాడు. అధ్యాపక వృత్తిని చేపట్టి ఆంధ్రదేశం తిరిగి లోకజ్ఞతని మనసులో కదిలసరచుకున్నాడు. 'దొనరికాలు' అనే మాట చలం జీవితంలో కనపడదు.

చలం 'మైదానం' తెలుగు నవలల్లో 'ఒక సంచలనాన్ని సృష్టించింది. కళాత్మకంగా ఓ పువ్వు పూసింది' పేరెన్నిక కంటే, మ్యూజింగ్స్, లేఖలు మొదలైనవి చలం తాత్వికతకి దర్పణాలు. జీవితం—ఆదర్శాల ఘర్షణ' ఆత్మకథ'గా 1973లో వచ్చింది. రమణాశ్రమంలో భగవద్గీత వ్యాఖ్యానం, వ్యాసాలు, భగవాన్ స్మృతులు మొదలైన రచనలు చేశారు. ఇవన్నీ ఒక ఎత్తు. శ్రీ శ్రీ మహాప్రస్థానానికి వ్రాసిన "యోగ్యతా పత్రం ఒక ఎత్తు. తెలుగులోని పీటికలు ఒకే మూసలో పడిపోతూ అంధానుకరణలో పయనిస్తున్నప్పుడు తెలుగు విమర్శకుల వెన్నుతట్టి, శ్రీ శ్రీ కి కీర్తి తెచ్చిపెట్టాడు యోగ్యతా పత్రాన్ని రాసిన చలం.

చలం చమత్కారానికి ఒక చిన్న ఉదాహరణని పరిశీలించండి. చలం ఇంట్లో బసవరాజనే స్నేహితుడు కందిపచ్చడి రుబ్బుతున్నాడు. చలానికి కందిపచ్చడి అంటే ప్రాణం. తీరా చూస్తే జీలకర్ర నిండుకుంది. వెంటనే ఒక కుర్రాడ్ని పిలిచి బసవరాజనీ, ఆ కుర్రాణ్ణి కూడా బజారుకెళ్ళి జీలకర్ర పట్టుకురమ్మన్నారు. "ఇద్దరూ ఎందుకకం" అని ప్రశ్నిస్తే "ఇద్దరూ చెరిసగం వడిస్తే త్వరగా తెస్తారని" అని సమాధాన మిచ్చాడు చలం.

తెలుగు సాహిత్యంలో దూషణ భూషణలకి గురైన రచయితలు చాలామంది లేకపోయినా, అసలు లేకపోలేదు. అయితే నలుగురూ నడిచే దారిన వెళ్ళడం ఏమంత కష్టం కాదని మనం తెలుసుకోవాలి. అయినా మనకి "గతస్య శోచనం నాస్తి" అనే సూక్తి ఉండనే ఉంది. మొత్తంమీద తెలుగులో సాహితీ ప్రభంజనాన్ని సృష్టించిన చలం ధన్యజీవి. అమరుడు. *

---

**దృష్టి**

అదృష్టం అనేది వేరుగా లేదు.

అదేదో వస్తుందని, మనిషి సిద్ధంగా వుండి, తన ధర్మాన్ని నెరవేర్చడానికి ఉపయోగిస్తుంది.